# ర్యాగింగ్

"ర్యాగింగ్ చేస్తారేమోనే సీనియర్లు" సుజాత భయంగా అంది.

"చేస్తారేమో ఏంటీ? చేస్తారు. అయితే ఏంటి?" అంది ప్రమీల.

"నాకు భయం. వాళ్ళేం చెయ్యమంటారో ఏమో?"

"ర్యాగింగ్ చేస్తారని భయపడితే మనం కాలేజీకి వెళ్ళినట్లే. వాళ్ళేదో చెయ్యమంటారు. మనం సరే అంటే పోతుంది. ఈ గొడవ ఫ్రెషర్స్ డే వరకూ వుంటుంది. ఆ తర్వాత ఏమీ వుండదు" ధైర్యం చెప్పింది ప్రమీల.

అయినా సుజాతకు లోలోపల జంకుగానే ఉంది. ర్యాగింగ్ గురించి ఏవేవో కథలు విన్నది. అవన్నీ గుర్తొచ్చి భయంవేస్తోంది.

"మనం లేటుగా వెళ్దామే." అంది సుజాత.

"లేటుగా వెళ్తే?"

"అప్పటికి అంతా కాలేజీలోకి వెళ్ళిపోయి ఉంటారుగా?"

"నీ మొఖం? ర్యాగింగ్ చేయాలనుకున్న వాళ్ళు హాస్టల్లో మన రూమ్‌కి వచ్చి కూడా చేస్తారు." అంది ప్రమీల.

"మనం ఒంటరిగా కాకుండా, జూనియర్స్

**వాణిశ్రీ**

నలుగురైదుగురం గుంపుగా వెళ్దాం. అప్పుడు సీనియర్స్ ర్యాగింగ్ చేయడానికి జంకుతారు." అంది సుజాత.

"సరే అలాగే చేద్దాం."

జూనియర్స్ నలుగురు కలిసి కాలేజీ గేటు దాటి లోపలకు వెళ్ళారు. అప్పటికీ ఆలస్యంగానే బయల్దేరారు. అయినా గ్రౌండ్‌లో అక్కడక్కడా సీనియర్స్ తిరుగుతూనే వున్నారు.

అరడజను మందిఉన్న సీనియర్స్ బ్యాచ్ లీడర్ రాజారామ్ సుజాత వాళ్ళకు అడ్డు పడ్డాడు.

"ఏయ్! ఆగండి. కాలేజీలో సీనియర్స్ మేము. మమ్మల్ని చూసి వెళ్ళిపోతున్నారేం కొంచెం కూడా మర్యాద లేకుండా" అన్నాడు రాజారామ్.

"వీళ్ళకి మర్యాద నేర్పు బాస్" ఎవరో అన్నారు.

"ఏం మర్యాద చెయ్యాలి మీకు?" ధైర్యంగా అడిగింది ప్రమీల.

"ముందు గుడ్‌మార్నింగ్ చెప్పండి"

"అలాగే. అంతా గుడ్‌మార్నింగ్ చెప్పండే..." అంది ప్రమీల.

"గుడ్‌మార్నింగ్ సార్!" అంతా కోరస్‌గా చెప్పారు.

"గుడ్... ఇప్పుడు మీరంతా మాకు గ్లాడ్ టూ మీట్ యూ అని షేక్ హేండ్స్ ఇవ్వాలి"

అన్నాడు రాజారామ్.

జూనియర్స్ ఒకళ్ళ ముఖం మరొకళ్ళు చూసుకున్నారు.

"షేక్‌హేండ్ ఇవ్వండే..." అని ప్రమీల తనే ముందుకు వెళ్ళి, సీనియర్స్ అందరికీ షేక్ హేండ్ ఇచ్చి 'గ్లాడ్ టూ మీట్ యూ' అని చెప్పింది.


అంతా ప్రమీలను ఫాలో అయ్యారు.

"మీ పేర్లు చెప్పి పరిచయం చేసుకోండి" అన్నాడు.

అంతా పేర్లు చెప్పారు.

"రేపు ఏం చేయాలో తెలుసా?" అడిగాడు రాజారామ్. తెలియదన్నట్టు తలవూపారు.

"మీలో అందంగావున్న అమ్మాయి ఎవరు?" అన్నాడు.




అంతా ముఖాలు చూసుకున్నారు.

"ఓహోఁ... మీరు చెప్పలేరు. ఎందుకంటే ఎవరికి వారు అద్దం ముందు కూర్చుని తామే మిస్ ఇండియా అనీ, మిస్ వరల్డ్ అనీ ఫీలవుతూవుంటారు కదూ?"

అతని కామెంట్‌కి మిత్రబృందం పకపక

నవ్వారు.

"ఒరేయ్! మీరు చెప్పండిరా! ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారిని అందగత్తెగా సెలెక్ట్ చేస్తాను"

అంతా సుజాత అందగత్తె అని చేతులెత్తారు.

సుజాత గుండెలో రాయిపడింది.

"మిస్ సుజాతా! యూ ఆర్ మిస్ కాలేజీ. రేపటికి"

అందరూ చప్పట్లు కొట్టారు.

"కంగ్రాట్స్"

సుజాత మాట్లాడలేదు. తనను ఏం చెయ్యమని అడుగుతాడో ఈ త్రాష్టుడు అని లోలోపల భయపడింది.

"రేపు మిస్ కాలేజీ సుజాత గార్లెండ్ తెచ్చి నా మెడలో వేస్తుంది" అన్నాడు రాజారామ్.

"ఏంటి బాస్? గాంధర్వ వివాహమా?" ఎవరో అడిగాడు.

"నో...నో... పూలదండ వేసినంత మాత్రాన పెళ్ళి చేసుకున్నట్టు కాదురా ఫూల్. మనం చూడడంలా... స్టేజీ మీద ఎందరికో ఎందరో పూలదండలు వేస్తుంటారు. చచ్చిన శవాలకు కూడా పూలదండలు వేస్తారు. అవన్నీ పెళ్ళిళ్ళా కావు. గౌరవించడం అన్నమాట. రేపు సుజాత నన్ను ఆ విధంగా గౌరవిస్తుందన్నమాట" అన్నాడు రాజారామ్.

సుజాత అయోమయంగా నిలబడింది. కళ్ళల్లో నుంచి నీళ్ళు కారుతున్నాయి.

"అలాగే బాస్" అని ప్రమీల సుజాత చెయ్యిపట్టుకుని నడిపించింది.

కొంతదూరం వెళ్ళాక "ఏమిటే మెడలో పూలదండ వెయ్యమంటాడూ?" ఆందోళనగా అడిగింది సుజాత.

"వెయ్యవే" అంది ప్రమీల నవ్వుతూ.

"నేను వేస్తాను సరే... దాన్ని ఎవడైనా ఫొటోతీసి, నేను వాడిని పెళ్ళిచేసుకున్నా...నని గొడవ చేస్తే?"

"చెయ్యనీ... ఎంత చదివినా చివరకు మనం పెళ్ళిచేసుకోక తప్పదుగా! ఒక పనైపోతుంది. మీ పేరెంట్స్‌కి కట్నాల గొడవ లేకుండా పోతుంది" నవ్వుతూ అంది ప్రమీల.

"ఛీ... నేను టెన్షన్‌తో చస్తూంటే నీకు నవ్వులాటగా వుందన్నమాట" అంది సుజాత.

"టెన్షన్ ఎందుకే? రేపొక గార్లెండ్ తెచ్చి వాడి మొహాన కొడితే పోతుంది"

"మొహాన కాదే... మెడలో వెయ్యమన్నాడు"

"సరే! మెడలోనే వేస్తే పోతుంది. ఆఫ్టాల్ ఫిఫ్టీ రుపీస్ వుంటుందేమో?"

"పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం అంటారు ఇందుకేనే..." ఉక్రోషంగా అంది సుజాత.

అంతా నవ్వారు.

★ ★ ★

మర్నాడు సుజాత, ప్రమీల వగైరాలంతా కాలేజీకి వెళ్ళేసరికి రాజారామ్ బ్యాచ్ వాళ్ళు దాదాపు పాతికమంది చేరారు.

జూనియర్ ఆడపిల్లల్ని చూసి హుషారుగా విజిల్స్ వేశారు.

"ఏయ్! గార్లెండ్ తెచ్చారా?" అడిగాడు రాజారామ్.

"తెచ్చాను బాస్" ధైర్యంగా చెప్పింది సుజాత.

"ఆలస్యం ఎందుకు? నా మెడలో వెయ్యి" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

"జస్ట్ వెయిట్ బాస్. అంకుల్స్ వస్తానన్నారు" అంది ప్రమీల.

"అంకుల్సా? వాళ్ళెవరు?"

ప్రమీల గేటువైపు చూపించింది.

గేట్లో నుంచి పోలీస్ వ్యాన్ వస్తోంది.

సీనియర్స్ గప్‌చిప్‌గా నిలబడిపోయారు.

పోలీస్ వ్యాన్ వారి దగ్గరే ఆగింది. ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్స్ దిగారు.

"ఏం జరుగుతోంది ఇక్కడ?" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"ర్యాగింగ్" చెప్పింది ప్రమీల.

"ఐ.సీ. సరే! కానివ్వండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సుజాతా! వెయ్యవే దండ" అంది ప్రమీల.

"దండ వెయ్యడం... అదేం ర్యాగింగ్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"బాస్ వెయ్యమన్నాడు సార్! ర్యాగింగ్ అంటే సీనియర్స్ ఏం చేప్తే అది జూనియర్స్ చెయ్యడం అన్నమాట" చెప్పింది ప్రమీల.

"ఏమాత్రం మార్చకూడదా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"కొంచెం మార్చవచ్చేమో?" అంది ప్రమీల.

"ఏం బాస్? కొంచెం మార్చవచ్చా?" రాజారామ్ వైపు చూసి అడిగాడు ఇన్‌స్పెక్టర్.

రాజారామ్ బిత్తరపోయి చూస్తున్నాడు. ఏం అంటే ఏం అంటాడో అని నోర్మూసుకున్నాడు. పోలీసుల వరకూ వెళ్ళారంటే వీళ్ళెవరో బాగా ఇన్‌ఫ్లూయన్స్ ఉన్న అమ్మాయిలని అర్థమైంది.

"బాస్ ఏం మాట్లాడ్డం లేదే?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సార్! సరదాగా ర్యాగింగ్ చేస్తున్నాం. సీరియస్‌గా తీసుకోకండి" నెమ్మదిగా అన్నాడు రాజారామ్.

"ఇదేం సరదారా రాస్కెల్? నీ చెల్లెల్ని ఎవడైనా మెడలో పూలదండ వెయ్యమంటే నువ్వు ఊరుకుంటావా? ఒక ఆడపిల్ల పరాయి మగాడి మెడలో పూలదండ వెయ్యడం అంటే దాని అర్థం నీకు తెలుసా?" కళ్ళెర్రజేసి అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ర్యాగింగ్ అంటే కొత్తగా వచ్చిన పిల్లలకి భయం పోగొట్టి, స్నేహంగా వుండడం. అంతేగాని శాడిస్ట్‌ల్లా ప్రవర్తించడంకాదు. నీలాంటి క్రూర మృగాల వంటి వాళ్ళ వల్ల సున్నితమైన మనస్థత్వం వున్న పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నార్రా?" ఆవేశంగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

సీనియర్స్ తలలు వంచుకుని నిలబడ్డారు.

"నీకు పూలదండతో సత్కారం కావాలా? చేస్తా... సత్కారం. అమ్మాయ్! ఏదీ దండ?" అన్నాడు.

సుజాత క్యారీ బ్యాగ్ ఇన్‌స్పెక్టర్‌కి అందించింది. అందులో నుంచి దండతీసి రాజారామ్ మెడలో వేసాడు.

"చప్పట్లు కొట్టండి."

అంతా చప్పట్లు కొట్టారు.

అది పాత చెప్పుల దండ. ●